# నా మొదటి విదేశయాత్ర

## రచన: కొవ్వలి సాయి శ్రావ్యవరాళి

క్రితం ఏడాది, వేసవి సెలవుల్లో అమ్మ, తమ్ముడు, నేను నాన్నగారిని చూడటానికి కొరియా వెళ్ళాము. మొదట వెళ్ళాలనుకో పోయినా చివరికి అదే జరిగింది. ఈ విధంగానైనా మా అమ్మతో (ఎందుకంటే ఇక్కడ బిజీ కదా) గడపవచ్చని ఆనంద పడ్డాం. అప్పటి దాకా మేము అక్కడికి వెళ్ళలేదు కాబట్టి మాకు ఎంతో ఉత్సాహంగా అనిపించింది. మా తమ్ముడైతే తెలిసినప్పటి నుండి బట్టలు సర్దుకోనడం మొదలు పెట్టాడు. తెలియకుండానే సమయం తొందరగా గడిచి పోయింది. మేము బయలుదేరవలసిన రోజు వచ్చేసింది. ఆవేళ ఒంటిగంటకు మా ప్రయణం. ఉత్సాహం మా నిండా వుంది. చివరికి ఫ్లయిటు ఎక్కాం. నాకు, మా తమ్ముడికి ఎన్నిసారులు ఫ్లయిటు ఎక్కినా బోరే కొట్టదు, అదేంటో. ఓ ఏడు గంటల్లో మలేసియా చేరుకున్నాము. అక్కడి విమానాశ్రయం పేరు క్లియా (KLIA). అబ్బ! ఎంత పెద్దదో! అక్కడ ఓ రోజు వుండ వలసి రావడం వల్ల, ఓ ఫైవ్ స్టారు హోటల్లో విశ్రాంతి తీసుకున్నాం. ఆ రాత్రే కొరియా వెళ్ళే ఫ్లయిటు ఎక్కాం. ఉదయం, ఫ్లయిటు దిగి, బ్యాగులు తీసుకొనే్టప్పటికి మా నాన్నగారు వచ్చేసారు. ఆయన్ని ఒక్కసారి దగ్గరికి తీసుకునేటప్పటికి మేము ప్రయాణం చేసొచ్చాం అనే సంగతి మర్చిపోయాం. ఒక్కసారిగా ఎంతో సుఖంగా అనిపించింది.

మా నాన్నగారు కొరియా లోని కోన్కుక్ యూనివర్సిటి లో పనిచేస్తున్నారు. యూనివర్సిటి వాళ్ళు మాకొక గది ఇచ్చారు. అక్కడ వాతావరణం నాకు చాలా నచ్చింది. ప్రకృతి ఎంతో ఆహ్లాదంగా అనిపించింది. అక్కడి మనుషులు ఎంతో మంచివారిలా అనిపించారు. మేము ఖాళీ సమయం లో మా నాన్నగారి నుంచి ఎన్నివిషయాలు తెలుసుకోగలితే అన్ని తెలుసుకుందాం అని నిర్ణయించుకున్నాం. ముందుగా కొరియా ముఖ్యపట్టణము సియోల్ అని తెలుసుకున్నాం. వారి భాషను హాన్-గ్యుల్ అంటారు. అక్కడి కరన్సీని వాన్లంటారు. ఒక వాను **4** పైసలతో సమానం. అంటే ఒక రూపాయి **25** వాన్లన్నమాట. తరువాత, కాస్త కొరియన్ భాష ను నేర్చుకున్నాము అంటే, కొన్ని పదాలను కొరియన్ లో మాటలాడడం నేర్చుకున్నాం. ఓ రెండు రోజులు విశ్రాంతి తీసుకొని తిరగటం మొదలెట్టాము. మొదట సియోల్ పార్కు, తరువాత కోఎక్స్ మాల్ , ఆ తరువాత హ్యాన్ రివర్ చూసాం. సియోల్ పార్కులో జూలో ఉండే జంతువులన్ని ఉన్నాయి. కోఎక్స్ మాల్ ఓ పెద్ద షాపింగ్ మాల్ అన్నమాట. దాంట్లో ఒక పెద్ద అక్వేరియం చూసాం. హ్యాన్ రివర్ కి వెళ్ళినప్పుడు బోటుకూడా ఎక్కాం. నిండా లైట్లు పెట్టిన ఆ పడవ చీకట్లో సూర్యుడిలా మెరిసింది. **63** బిల్డింగు అని అరవై మూడు అంతస్తుల భవనం కూడా చూసాం. దానిపై అంతస్తునుంచి చుట్టూ ఉన్న నగరాన్ని చూడడం గొప్ప అనుభవం.

సియోల్ కి కాస్త దూరంలో గ్యాంగ్జు అనే ఊరు ఉంది. అది చాలా పురాతనమైనది. అక్కడ ముందుగా చూడవలసిన స్థలాలు, గుళ్ళే. అక్కడ పాత భవనాలు కూడా

చాలా ఉన్నాయి. వాటిలో గ్యేంగ్ సాంగ్ బుక్ ఒకటి. అక్కడే కొరియాలో ప్రసిద్ధి చెందిన బుల్ గుక్ సా బౌద్ధాలయం చూసాం. తరువాత ఛేజు (జేజు) అనే ద్వీపానికి వెళ్ళాం. అక్కడ ఉన్నంతసేపు ప్రకృతికి చాలా దగ్గరగా ఉన్నట్టు అనిపించింది. అక్కడ ఓ గుడి (బుద్ధుడిది), ఓ పార్కు (బొటానికల్ గార్డెన్), ఓ బీచు(జుసాన్గ్ జాలీడే), ఇంకా ఎన్నో చూసాం. అక్కడ సబ్ మెరైన్ కూడా ఎక్కాం. మామూలుగా సబ్ మెరైన్ చూడటమే కాని ఎక్కడం ఇండియా లో కుదరదు. కానీ చేజు లో ఆ అవకాశం దొరికింది. అసలు సముద్రం కింద అంత ప్రపంచం ఉంటుందంటే నమ్మలేకపోయా. ఎన్ని రకాల చేపలున్నాయో! తరువాత ఓ పెద్ద వంతెన చూడటానికి వెళ్ళాం. వంతెనంటే మనుషులు దాటడానికే కాదు కళాప్రదర్శనకి కూడా అని దాన్ని చూసాక తెలిసింది. ఆ వంతెన పేరు సెవెన్ నిమ్ఫ్ బ్రిడ్జ్. దాని బయటి గోడమీద ఏడుగురు కన్యల బొమ్మలు చెక్కారు. అది ఎంతో ఘనంగా ఉంది. ఆ తరువాత ఓ మినియేచర్ పార్కుకు వెళ్ళాం. ఇక్కడ పెద్ద పెద్ద ప్రపంచ ప్రసిద్ధ భవనాలన్ని చిన్న చిన్న గా చేసి పెట్టారు. వీటిల్లో తాజ్ మహల్ కూడా ఉంది. చేజు లో నాకు చాలా నచ్చిన వాటిలో టెడ్డిబేర్ మ్యూజియం ఒకటి. టెడ్డిబేర్ మ్యూజియం ఉద్దేశం ఏమిటంటే ప్రతి చోట మనుషుల బదులు టెడ్డిబేర్ లు ఉంటాయి. ఉదాహరణకు, మోనాలీసా టెడ్డిబేర్, పెళ్ళి హడావుడి లో ఉన్న టెడ్డిబేర్లు ఉన్నాయి. అంతా చూసిన తరువాత చివరిలో వున్న గాంధీ టెడ్డిబేర్ నాకు చాల నచ్చింది. వాళ్ళ రాజులు, స్వాతంత్ర యోధులతో పాటు మన జాతిపిత బొమ్మ కూడా పెట్టారంటే చాలా ఆశ్చర్యమేసింది. గర్వంగా అనిపించింది.

తిరిగి సియోల్ వచ్చిన తరువాత కూడా అమ్మనాన్నలతో ఆనందంగా గడిపాం. ఒక రోజు కొరియన్ భోజనం కూడా చేసాం. కాలం మనకిష్టమైన విధంగా గడుస్తునప్పుడు చాలా తొందరగా గదిచిపోతున్నట్టు అనిపిస్తుందట. ఇప్పుడు అది నిజం అనిపించింది. మేము బయలుదేరవలసిన రోజు వచ్చింది. ఈ సారి మా నాన్నగారితో పాటు తిరిగిరావాలి. వచ్చేటప్పుడు సింగపూర్, మలేషియా, హాంగ్కాంగ్ కూడా చూసాం (వాటి గురించి మరోసారి మాట్లాడుకుందాం). ఏమైతేనేం ఈ యాత్ర చాలా ఆనందంగా గడిచింది. మరిచిపోలేని అనుభవంగా మిగిలింది.




పేరు: కొవ్వలి సాయీ శ్రావ్యవరాళి

8వ తరగతి, ఆంధ్రమహిళాసభ పి.ఓబుల్ రెడ్డి పబ్లిక్ స్కూల్,

హైదరాబాదు.


అభిరుచులు – కర్ణాటకసంగీత గాత్రం, కథలు చదవడం, వ్రాయడం